సాక్షి ప్రకాశం
బుధవారం, 5, మార్చి, 2025



గ్రామకంఠంలో పచ్చగద్దలు

పీసీపల్లి మండలం పెద ఇర్లపాడులో విలువైన గ్రామకంఠం భూములను టీడీపీ నాయకులు కబ్జా చేసి వెంచర్లుగా మార్చారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. - 8లో..



పనికావాలంటే చేయితడపాల్సిందే

సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. కొందరు అధికారులు పైసా ముట్టజెప్పందే పని చేయడం లేదు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

బుధవారం	ఇఫ్తార్
సాయంత్రం	గం 6 : 26
గురువారం	సహారి
ఉదయం	గం 5 : 06

న్యూస్‌రీల్

తెల్ల పేపరుపై హాల్‌టికెట్లు ప్రింట్‌అవుట్ తీయాలి

ఒంగోలు సిటీ: మార్చి 2025 పరీక్షలకు హాజరయ్యే మొదటి లేదా రెండో సంవత్సరం ఇంటర్మీడియెట్ విద్యార్థులందరూ తమ హాల్‌టికెట్లను వైట్ పేపరు మీద మాత్రమే ప్రింట్ అవుట్ తీసుకొని పరీక్ష హాల్‌కు రావాలని ఆర్ఐఓ సైమన్ విక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలర్ పేపరు మీద హాల్‌టికెట్లను ప్రింట్ అవుట్ తీసిన విద్యార్థులను పరీక్షల హాల్‌లోకి అనుమతించరని అన్నారు. విద్యార్థులందరూ గమనించాలని కోరారు.

పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వెంకట శివప్రసాద్



ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి

పెద్దదోర్నాల: ఇంటర్, పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వెంకట శివప్రసాద్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాలలో మంగళవారం నంద్యాల, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలోని ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకులాల ప్రిన్సిపాల్, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ గూడెం వారీగా హౌస్‌హోల్డ్ సర్వే నిర్వహించాలన్నారు. గూడేల్లో రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఫుడ్ బాస్కెట్ ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు తమ వంతు విధులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, విద్యా నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంపీ రామాంజనేయులు, ఎంఈఓ కొండల నాయక్, మంతన్న, లాలా అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

దామచర్ల బ్రదర్స్. జిల్లా టీడీపీలో హాట్ టాపిక్. ఇద్దరి మధ్య ఏమాత్రం పొసగడంలేదు. ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించేందుకు చేస్తున్న యత్నాలు రసవత్తరంగా మారాయి. ప్రస్తుతం వారిద్దరి మధ్య వివాదం తార స్థాయికి చేరుకుంది. బినామీ పేర్లతో సాగిస్తున్న వ్యాపారాలపై అధికారులను ఉసిగొల్పుతూ కేసులు పెట్టుకునే స్థాయికి వెళ్లింది. తాజాగా ఒంగోలు నగరంలో ఎలాంటి ఫ్లెక్సీలు కట్టరాదంటూ రాత్రికి రాత్రే కార్పొరేషన్ అధికారులు నోటీసులు ఇవ్వడం వెనక తమ్ముడి పుట్టిన రోజు సందర్భంగా చేసే హడావుడికి అడ్డుకట్ట వేసేందుకు అన్న వేసిన ఎత్తుగడ ఇది అని అధికార పార్టీ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. అన్నదమ్ముల మధ్య ఫ్లెక్సీల రగడ ఏ మలుపు తీసుకుంటుందో చూడాలి.



అన్నతమ్ముళ్లు.. ఆధిపత్య ముల్లు!

అభద్రతలో జనార్దన్...

ఒంగోలు నియోజకవర్గం నుంచి 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన దామచర్ల జనార్దన్ ఓటమిపాలయ్యారు. ఆ తరువాత 2014 ఎన్నికల సమయంలో ఈ సీటు కోసం దామచర్ల సత్య ప్రయత్నించారు. అయితే జనార్దన్ వైపే అధిష్టానం మొగ్గుచూపింది. ఆ ఎన్నికల్లో జనార్దన్ విజయం సాధించడంలో సత్య కీలకపాత్ర పోషించినట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నారు. దాంతో సత్య ఎప్పటికైనా తనకు పోటీగా ఎదుగుతాడన్న అనుమానం జనార్దన్‌లో బలంగా నాటుకొని పోయిందని అంటున్నారు. ఈ క్రమంలోనే 2016లో సత్య పుట్టిన రోజు సందర్భంగా ఒంగోలు నగరంలో ఏర్పాటు చేసిన సత్య ఫ్లెక్సీలను చించేసినట్లు అప్పట్లో బాగా ప్రచారం జరిగింది. అప్పటి నుంచి స్వగ్రామమైన తూర్పునాయుడు పాలెంలోనే సత్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సత్యకు మారిటైం బోర్డు చైర్మన్ పదవి రాకుండా చేయడానికి ఎమ్మెల్యే జనార్దన్ చివరి నిముషం వరకు ప్రయత్నించినట్లు సమాచారం. అయితే లోకేష్‌తో ఉన్న సాన్నిహిత్యంతో సత్య కార్పొరేషన్ పదవిని తెచ్చుకున్నారు.

- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మధ్య ముదిరిన పోరు
- ఒకరి వ్యాపారాలపై మరొకరు గురి
- చినబాబు అండతో దూకుడు పెంచిన సత్య
- అభద్రతాభావంలో ఎమ్మెల్యే జనార్దన్
- నగరంలో సత్య బర్త్ డే ఫ్లెక్సీలు కట్టకుండా రాత్రికి రాత్రే నోటీసులు
- రగిలిపోతున్న సత్య అనుచర వర్గం
- తాడోపేడో తేల్చుకునేందుకు ఒంగోలులో సత్య కార్యాలయం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లా టీడీపీలో దామచర్ల సోదరుల మధ్య రాజకీయంగానే కాదు వ్యాపార పరంగాను ఆధిపత్య పోరుసాగుతోంది. దామచర్ల జనార్దన్ ఒంగోలు ఎమ్మెల్యేగా ఉండగా, ఆయన సోదరుడు సత్య లోకేష్ అండదండలతో ఏపీ మారిటైంబోర్డు చైర్మన్‌గా ఉన్నారు. ఇద్దరి మధ్య ఎప్పటి నుంచో వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇద్దరి మధ్య పోరు ముదిరి పాకాన పడింది. అధికారంలోకి వచ్చాక అన్నదమ్ములు పోటాపోటీగా అక్రమ వ్యాపారాలకు శ్రీకారం చుట్టారని, బినామీ పేర్లతో మట్టి, ఇసుక, మద్యం, రేషన్, మైనింగ్ దందాలు చేస్తున్నట్లు ఆరోపణలు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో ఒకరి వ్యాపారాన్ని మరొకరు దెబ్బ తీయాలన్న కసితో అధికారులను ఉసికొల్పుతున్నట్లు సమాచారం.

ఒకరిపై ఒకరు ఫిర్యాదులు..

దామచర్ల సోదరుల మధ్య రాజకీయ వివాదం ప్రస్తుతం వారు చేస్తున్న బినామీ వ్యాపారాలకు పాకిందని ఆ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నట్లు సమాచారం. జనార్దన్ అనుచరులు ఇటీవల జరుగుమల్లి, కామేపల్లి మండలాల్లో ఇసుక క్వారీలు కొనుగోలు చేసినట్టు తెలిసింది. ఇక్కడ నుంచి ప్రతి రోజు వందల ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా ఒంగోలుకు తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో కొండపి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ఇక్కడి ఇసుకనంతా ఒంగోలుకు తరలించుకొని పోతే మేమంతా ఏమైపోవాలని ప్రశ్నించినట్లు సమాచారం. దాంతో ఇసుక ట్రాక్టర్లు ఒంగోలుకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సత్య ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం.

ఇదిలా ఉండగా కొంతకాలంగా ఒంగోలు మండలంలోని యరజర్ల, టంగుటూరు మండలంలోని కొణిజేడు, సింగరాయకొండ మండలంలోని పాత సింగరాయకొండ, శానంపూడి తదితర ప్రాంతాల్లోని కొండలు, డీకే భూముల్లో ఇద్దరు మనుషులు భారీగా మట్టి తవ్వకాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో సత్య కు చెందిన వాహనాలపై కేసులు నమోదు చేయాలంటూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. అలాగే సింగరాయకొండలోని ఒక రైస్ మిల్లుపై కూడా జనార్దన్ వర్గం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విజిలెన్స్ అధికారులపై ఒత్తిడి చేసి మిల్లును సీజ్ చేయించాలని ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.



సౌత్ బైపాస్ వద్ద సత్య అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగిస్తున్న దృశ్యం

తాజాగా ఫ్లెక్సీల రగడ

ఎమ్మెల్యే జనార్దన్ పుట్టిన రోజు వేడుకలు జనవరి 20వ తేదీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన అభిమానులు నగరం అంతటా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి వరకూ అవి అలాగే ఉన్నాయి. దాదాపు మూడు నెలల పాటు ఈ ఫ్లెక్సీల కారణంగా నగర ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డా ఇటు కార్పొరేషన్ అధికారులు కానీ అటు పోలీసులుకానీ స్పందిస్తే ఒట్టు. సత్య పుట్టిన రోజు సందర్భంగా నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి నెల్లూరు బస్టాండు వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వరకు ఫ్లెక్సీలు వేసేందుకు సిద్ధం చేసుకుంటుండగా సోమవారం సాయంత్రం నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు నగరంలో ఎలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదంటూ నోటీసు ఇవ్వడం వివాదంగా మారింది. నిన్న మొన్నటి వరకు లేని ఆంక్షలు ఇప్పుడే ఎందుకు విధిస్తున్నారో చెప్పాలని సత్య వర్గం ప్రశ్నిస్తోంది. ఎమ్మెల్యే జనార్దన్ ఒత్తిడితోనే నగర పాలక సంస్థ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారని మండిపడుతున్నారు.



కొత్తపట్నం బస్టాండ్ వద్ద దామచర్ల జనార్దన్ అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ..

లోకేష్ అందండలతో సత్య దూకుడు

మారిటైం బోర్డు చైర్మన్‌గా ఉన్న సత్యకు చంద్రబాబు తనయుడు, మంత్రి లోకేష్ అండదండలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో అన్నను రాజకీయంగా ఎదుర్కొనేందుకు ఆయన దూకుడు పెంచినట్టు సమాచారం. ఇద్దరి మధ్య విభేదాలు తీవ్రతరమైన నేపథ్యంలో భాగ్యనగర్‌లో సత్య సొంతంగా కార్యాలయం ఏర్పాటు చేసుకుంటున్నారు. పుట్టిన రోజు సందర్భంగా కార్యాలయాన్ని కూడా ప్రారంభించాలని ఉన్నట్లు తెలుస్తోంది. సత్య కనుక నగరంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుంటే తన పరపతి తగ్గిపోవడం ఖాయమని జనార్దన్ భావిస్తున్నట్లు సమాచారం. దాంతో ఎలాగైనా సరే సత్యను అడ్డుకోవాలన్న లక్ష్యంతోనే ఫ్లెక్సీల ఏర్పాట్లను అడ్డుకున్నట్లు తెలుస్తోంది.

గతంలోనూ ఇదే తంతు...

గతంలో 2014-19 మధ్య తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్న సందర్భంలో కూడా ఇద్దరి మధ్య వివాదాలు నడిచాయి. తనను రాజకీయంగా ఎదగకుండా జనార్దన్ అడ్డుకుంటున్నాడని గుర్తించిన సత్య నారా లోకేష్‌కు దగ్గరవుతూ వచ్చారు. ఎన్నికల ముందు ఆయన ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జిగా వ్యవహరించారు కూడా. 2022లో ఒంగోలు కేంద్రంగా టీడీపీ నిర్వహించిన మహానాడులో సందర్భంగా నగరంలో జనార్దన్, సత్య వర్గాలు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సత్య ఫ్లెక్సీలు వేయడం సహించలేకపోయిన జనార్దన్ వాటిని బలవంతంగా తీయించారన్న ఆరోపణలు వచ్చాయి. అయితే గత ఎన్నికల సమయంలో జనార్దన్, సత్యలను పిలిపించి చంద్రబాబు ఇద్దరి మధ్య రాజీ చేసినట్లు తెలుస్తుంది. అప్పటికి సర్దుకున్నా అధికారంలోకి వచ్చాక ఇద్దరి మధ్య వివాదాలు ముదిరిపాకాన పడ్డాయి.



ప్రభుత్వం అందిస్తున్న కందిపప్పు ప్యాకెట్లు

కందిపప్పు కట్!

- రేషన్‌కార్డుదారులకు ఈనెల అందని కందిపప్పు
- ఉగాది పండుగకు పప్పన్నం లేనట్లే..
- బయట మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.160

మార్కాపురం: తెలుగు వారి పెద్దపండుగైన ఉగాదికి రేషన్‌కార్డుదారులు పప్పన్నం తినలేని పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 4 నెలల నుంచి కందిపప్పులో కోత విధిస్తూ ఈనెల నుంచి పూర్తిగా నిలిపేశారు. జిల్లాలో మొత్తం రేషన్ దుకాణాలు 1392, రేషన్‌కార్డు దారులు 6,76,160 మంది ఉన్నారు. సుమారు నెలకు 655 టన్నుల వరకూ కందిపప్పు అవసరం. ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా కిలో రూ.67కే కందిపప్పు అందిస్తోంది. దీంతో చాలా మంది ప్రతి నెలా కందిపప్పు, చెక్కర, బియ్యం తీసుకుంటున్నారు. నవంబరు నుంచి కూటమి ప్రభుత్వం రేషన్ సరుకుల్లో ప్రధానమైన కందిపప్పు సరఫరాలో కోత విధిస్తూ మార్చి నెలలో ఏకంగా కోటా తీసేసింది. దీంతో రేషన్‌కార్డుదారులు పప్పన్నం తినాలంటే బయట మార్కెట్‌లో కిలో రూ.160 పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది.

కందిపప్పు కేటాయింపు ఇలా...

మార్కాపురం పౌరసరఫరాల శాఖ గోడౌన్ పరిధిలో మార్కాపురం, తర్లుపాడు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాలు ఉన్నాయి. ప్రతి నెలా ఈ మండలాల్లోని రేషన్‌షాపులతోపాటు దొనకొండలో 8 షాపులు, కొనకనమిట్లలో 6 షాపులకు గానూ మొత్తం కలిపి 150 రేషన్ దుకాణాలకు 78 టన్నుల కందిపప్పు రావాల్సి ఉండగా జనవరిలో 45 టన్నుల కందిపప్పు మాత్రమే సరఫరా చేశారు. పొదిలి పౌరసరఫరాల శాఖ గోడౌన్ పరిధిలోని పొదిలి, కొనకనమిట్ల మండలాలకు గానూ 40 టన్నుల కందిపప్పునకు గాను 28 టన్నుల కందిపప్పు మాత్రమే సరఫరా అయింది. మార్చిలో కందిపప్పు సరఫరా పూర్తిగా నిలిపేశారు.

ప్రభుత్వం కందిపప్పు ఇవ్వాలి

ఈనెలలో పెద్ద పండుగ ఉగాది ఉన్నందున ప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు కందిపప్పు ఇవ్వాలి. అలాగే సామాన్య ప్రజలకు కూడా కిలో కందిపప్పు ఇస్తే బాగుంటుంది. బయట మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.160 వరకూ ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించి అందరికీ కందిపప్పు ఇవ్వాలని కోరుతున్నా. – ఓప మల్లిక్, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు



ప్రభుత్వం నుంచి కందిపప్పు అందలేదు

ఈనెలలో ప్రభుత్వం నుంచి రావాల్సిన కందిపప్పు రాకపోవడంతో జిల్లాలో వినియోగదారులకు కందిపప్పు అందించలేకపోయాం. ప్రభుత్వం సరఫరా చేస్తే అందిస్తాం. – ఎస్ పద్మశ్రీ, డీఎస్‌ఓ, ఒంగోలు

రామతీర్థం అందించవా స్వామీ..!

- 11 గ్రామాలకు 13 రోజులుగా నిలిచిన రామతీర్థం నీరు
- విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పగిలిన తాగునీటి పైపులు
- విద్యుత్ కాంట్రాక్టర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ



మర్రిపూడిలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం



కాకర్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

మర్రిపూడి:

విద్యుత్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల మధ్య సమన్వయ లోపంతో 11 గ్రామాలకు 13 రోజులుగా నీటిసరఫరా నిలిచిపోయింది. మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న మర్రిపూడి మండలంలోని 32 గ్రామాలకు రామతీర్థం జలాశయం నుంచి నీరందిస్తున్నారు. జిల్లాలోని పశ్చిమప్రాంతం అత్యంత ఫ్లోరైడ్ ప్రాంతంగా గుర్తించి వారికి శుద్ధ జలాలు అందించే లక్ష్యంతో 2008లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రామతీర్థం రిజర్వాయర్ నుంచి రూ.5 కోట్లు వెచ్చించి ఫిల్టర్ బెడ్‌లలో రోజుకు 2 లక్షల లీటర్‌లు శుద్ధిచేసి పైపులైన్ ద్వారా ఈ నీటిని అందిస్తున్నారు. అయితే ఆ లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం నీరు కారుస్తోంది. ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద మండలంలోని రూరల్ గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందించేందుకు నూతన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారు. నూతన స్తంభాల ఏర్పాటు కోసం గుంతలు తీశారు. ఈ క్రమంలో దాదాపు 9 ప్రదేశాల్లో తాగునీటి పైపులు పగిలిపోయి నీరు వృథాగా పోతున్నాయి. లీకులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తలనొప్పిగా మారాయి. విషయం తెలుసుకున్న నీటిపారుదల శాఖాధికారులు తాగునీటి సరఫరాను ఆయా గ్రామాలకు నిలిపేశారు. దీంతో మండలంలోని దుగ్గిరెడ్డిపాలెం, వల్లాయపాలెం, చిమట, పాత పన్నూరు, కొత్తపన్నూరు, శివరాయునిపేట, కాకర్ల, చిలంకూరు, కూచిపూడి, మర్రిపూడి, ఏలూరు గ్రామాలకు 13 రోజులుగా రామతీర్థం నీరు నిలిచిపోయింది. వేసవి సమీపిస్తున్న తరుణంలో తాగునీరు అందకపోవడంతో బోరునీరు, బబుల్స్ వాటర్‌ను మండల వాసులు ఆశ్రయిస్తున్నారు. ఆ నీరు తాగడం వల్ల జలుబు, జ్వరాలు వస్తున్నాయని వారు వాపోతున్నారు. మండలంలోని శివరాయునిపేట నుంచి కాకర్ల మీదుగా చిలంకూరు గ్రామానికి త్రిఫేస్ విద్యుత్ సరఫరా చేసేందుకు నూతన విద్యుత్ స్తంభాలతోపాటూ, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో పైపులైన్‌లు పగిలిపోయాయని, లీకులకు కొంత పరిహారం చెల్లించాలని గ్రామ నీటి సరఫరా అధికారులు విద్యుత్ శాఖాధికారులను డిమాండ్ చేశారు. అయినా విద్యుత్‌శాఖాధికారుల నుంచి సరైన సమాధానం లేకపోవడంతో విద్యుత్‌శాఖ కాంట్రాక్ట్ పై మర్రిపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జైపాల్ తెలిపారు. రెండు శాఖల అధికారులను ఒప్పించాలన్న ఎస్ఐ సురేష్‌బాబు ప్రయత్నం ఫలించలేదు. మండల స్థాయి అధికారులు నేటికీ తాగునీటి సమస్యపై పరిష్కారం చూపలేదు. మంత్రి సొంత నియోజకవర్గంలో దాదాపు 13 రోజులుగా ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు మండుతున్న తరుణంలో తాగునీరు అందించాలని వారు కోరుతున్నారు.



వృథాగా పోతున్న నీరు

13 రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నాం

శివరాయునిపేట, కాకర్ల గ్రామాల మీదుగా చిలంకూరు గ్రామానికి నూతన కరెంటు స్తంభాలు వేస్తున్నారు. స్తంభాలకు గుంత తీస్తున్న క్రమంలో రామతీర్థం పైపులు పగిలిపోయాయి. 13 రోజులు గడుస్తున్నా, పగిలిన పైపులైన్ మరమ్మతులు చేసి నీరు ఇవ్వలేదు. దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సమస్య పరిష్కారం కాకుంటే మహిళలతో కలిసి ధర్నాకు దిగుతాం.
– మొల్లల శివరామిరెడ్డి, మాజీ చిమట సొసైటీ అధ్యక్షుడు, కాకర్ల



రామతీర్థం జలాలు అందించాలి

రామతీర్థం నీరు గ్రామానికి రాకపోవడంతో బోరు నీటిని ఆశ్రయిస్తున్నాం. కొంత మంది బబుల్స్ నీరు కొనుక్కుంటున్నారు. ఎండలు మండుతున్నాయి. చుక్క నీరు లేక గ్రామస్తులందరం ఇబ్బందులు పడుతున్నాం. మంత్రి ఇలాఖాలో ఇంతకంటే ఇబ్బంది ఏం ఉంటుంది. 13 రోజులుగా 11 గ్రామాలకు తాగునీరు నిలిచిపోయింది. పట్టించుకునే నాథుడేలేదు. మరమ్మతులు చేసి నీరందించాలి.
– ఎస్‌కే సిలార్, కాకర్ల





రక్తకణాలు ఇస్తున్న సుబ్బారెడ్డి

మూలరక్త కణాలు ఇచ్చి ప్రాణాలు కాపాడి..



సుబ్బారెడ్డిని అభినందిస్తున్న క్విస్ కళాశాల చైర్మన్ డాక్టర్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి

ఒంగోలు సిటీ: క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆరేళ్ల చిన్నారి చికిత్స కోసం మూలరక్త కణాలు ఇచ్చి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడాడు ఓ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి. వివరాల్లోకి వెళ్తే.. ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో సీఎస్‌బీఎస్ రెండో ఏడాది చదువుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ దోసపాటి సుబ్బారెడ్డి.. హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రిలో క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆరేళ్ల చిన్నారి చికిత్స కోసం మూలరక్త కణాలు ఇచ్చి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. ఇలాంటి అవకాశం అరుదుగా దక్కుతుందని, ఈ విషయంపై అవగాహన కలిగి, హైదరాబాద్‌కు వెళ్లి డొనేట్ చేసి రావడం గొప్పవిషయమని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్యకళ్యాణ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి విద్యార్థిని మంగళవారం అభినందించారు. సుబ్బారెడ్డి తన మూలరక్త కణాలను ఇచ్చేందుకు ఒప్పుకున్న అతని తల్లిదండ్రులు వెంకటరత్తమ్మ, నరసారెడ్డిని కూడా అభినందించారు. ప్రతి ఒక్కరూ రక్తదానం, కణాల దానంపై అవగాహన కలిగి ఉండాలని, అది ఒక నిండుప్రాణాన్ని కాపాడుతుందని అన్నారు. రక్తకణాలను దానం చేసిన సుబ్బారెడ్డికి ధాత్రి బ్లడ్ స్టెమ్ డొనేషన్ వారు ప్రశంస పత్రం అందించారు.

క్లుప్తంగా

ఇంజన్‌లో మంటలు.. కారు దగ్ధం


దగ్ధమైన కారును పరిశీలిస్తున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: మరమ్మతుల కోసం తీసుకెళ్తుండగా ఇంజన్‌లో మంటలు చెలరేగి కారు దగ్ధమైంది. ఈ సంఘటన హనుమంతునిపాడు మండలంలోని హాజీపురం సమీపంలో సోమవారం రాత్రి ఒంటి గంట సమయంలో చోటుచేసుకుంది. ఎస్సై ఎం.మాధవరావు కథనం మేరకు.. కనిగిరి పట్టణానికి చెందిన సయ్యద్ హనీఫ్‌కు చెందిన కారుకు మరమ్మతులు చేయించేందుకు డ్రైవర్ మన్నెం కృపాదానం కర్నూలు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో హాజీపురం సమీపంలోని టూరిజం పార్కు వద్ద ఇంజన్ నుంచి పొగలు వచ్చాయి. డ్రైవర్ కారు ఆపి బాయ్‌నెట్ డోర్ తెరవగా ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో డ్రైవర్ ముఖానికి కాలిన గాయాలయ్యాయి. డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి మంటలు ఆర్పివేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏఆర్ కానిస్టేబుల్ అదృశ్యం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య

కంభం: తన భర్త 15 రోజులుగా ఇంటికి రావడం లేదని షేక్ నఫియా అనే వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. కంభం పట్టణానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ఆరీఫ్ బాషాతో నఫియాకు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. ఇటీవల కాలంలో భర్త ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో ఎస్పీ కార్యాలయంలో ఆమె గోడు వెళ్లబోసుకున్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు మంగళవారం ఆమె కంభం పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గత 7 నెలలుగా ఇంటి అవసరాలకు భర్త డబ్బు ఇవ్వడం లేదని, గత 15 రోజులుగా ఫోన్ స్విచాఫ్ చేశాడని వాపోయారు. పోలీసులు విచారించి న్యాయం చేయాలని కోరారు.

కేసుల పరిష్కారానికి కక్షిదారులు సహకరించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి

ఒంగోలు: ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి కక్షిదారులంతా సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎ.భారతి పేర్కొన్నారు. ఈనెల 8వ తేదీ రెండో శనివారం దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని న్యాయస్థానాల్లో ఈ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారన్నారు. రాజీకి అర్హత కలిగిన అన్ని క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా పరిహారపు చెల్లింపు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులు ఇరువర్గాల ఆమోదంతో పరిష్కరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల్లో ఉన్నవారు ఉపయోగించుకుని వ్యాజ్యాలను పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసుల్లో తీర్పు అంతిమ తీర్పు అని, కోర్టుల్లో చెల్లించిన ఫీజు కూడా తిరిగి పొందవచ్చన్నారు. ప్రీ సిట్టింగ్ రూపంలో ఇరువర్గాల ఆమోదంతో ముందస్తుగా వ్యాజ్యాల పరిష్కారానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ, సంబంధిత న్యాయవాదులు, మీడియేషన్ న్యాయవాదులు సహకరిస్తారని, ఇదే విధంగా పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి పేర్కొన్నారు.

పని కావాలంటే.. చేయి తడపాల్సిందే!

- అవినీతికి కేరాఫ్‌గా సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయం
- అన్నీ తానై చక్రం తిప్పుతున్న ఓ వీఆర్‌ఏ
- భూ సమస్యలు, ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజల ప్రదక్షిణలు
- కార్యాలయ ఉద్యోగులపైనా పక్షపాతం చూపుతున్నట్లు ఆరోపణలు


తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బైఠాయించి నిరసన తెలుపుతున్న అర్జీదారుడు

సంతనూతలపాడు:

కూటమి ప్రభుత్వం కొలువయ్యాక సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. కొందరు రెవెన్యూ అధికారులు పైసా ముట్టజెప్పందే.. పని చేయని పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్ ఇతరత్రా సర్టిఫికెట్లు కావాలంటే కొంత మంది అధికారులు వేల రూపాయలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముడుపులు చెల్లిస్తే తప్ప భూమి సర్వే దరఖాస్తుల వైపు కన్నెత్తి చూడటం లేదని అర్జీదారులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. కార్యాలయంలో ఏ పనీ కావడం లేదంటూ తరచూ బాధితులు నిరసన వ్యక్తం చేస్తుండటం గమనార్హం. ప్రస్తుతం కార్యాలయంలో జరుగుతున్న పలు కార్యకలాపాలపై ఉద్యోగుల మధ్యే తీవ్ర స్థాయిలో చర్చ నడుస్తోంది.

కొందరు ఉద్యోగులకే ప్రాధాన్యతను ఇస్తూ...

కార్యాలయంలో కొందరు ఉద్యోగులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో సానుకూలంగా ఉన్న అధికారులు ధ్రువీకరించిన సర్టిఫికెట్లకు ఆమోదం తెలపడం, సానుకూలంగా లేని అధికారులు ఇచ్చిన ధ్రువపత్రాలను తిరస్కరిస్తున్నారనే విషయం చర్చనీయాంశమైంది. ఉద్దేశపూర్వకంగానే కొర్రీలు పెడుతూ కుల ధ్రువీకరణ పత్రాలను పెండింగ్‌లో ఉంచుతుండటంతో విద్యార్థులు, ఇతర అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక వీఆర్‌వోల విషయంలో కూడా కొందరికే ప్రాధాన్యతను ఇస్తూ పనులు అప్పగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు తహసీల్దార్ కార్యాలయంలో సముచిత గౌరవం దక్కడం లేదని కూటమి ప్రజాప్రతినిధులు సైతం నొచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఓ వీఆర్‌ఏ అన్నీ తానై వ్యవహరిస్తూ, పనులు చేయిస్తామని దరఖాస్తుదారుల నుంచి పెద్దమొత్తంలో నగదు గుంజుతున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

సామాన్యులకు సవాలక్ష కొర్రీలు

రెవెన్యూపరమైన సమస్యలపై కార్యాలయానికి వెళ్లే సామాన్యులను సవాలక్ష కొర్రీలతో అధికారులు తిప్పలు పెడుతున్నారు. అదే రూ.లక్షల్లో ముడుపులు వస్తాయంటే నిబంధనలు సైతం వారు తుంగలో తొక్కి తామే స్వయంగా ఫీల్డుకు వెళ్లి అప్పనంగా వారికి కట్టబెట్టేందుకు సైతం వెనుకాడడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో భూముల రీసర్వే సైతం అటకెక్కింది. రీసర్వేను పర్యవేక్షించి గాడిలో పెట్టాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడడం లేదన్న ఆరోపణలున్నాయి.

పొజిషన్ సర్టిఫికెట్ కోసం నిరసన

పేర్నమిట్ట గ్రామానికి చెందిన తుళ్లూరు బోసుబాబు తనకు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా తిప్పుకుంటున్నారంటూ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పేర్నమిట్ట ఎస్సీ కాలనీకి చెందిన తుళ్లూరి ప్రభుదాసుకు 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఐదు సెంట్ల నివాస స్థలాన్ని కేటాయించింది. ఆ స్థలంలో ఏళ్లుగా నివాసం ఉంటున్నామని అర్జీదారురాలైన తుళ్లూరు సుభాషిణి భర్త తుళ్లూరి బోసుబాబు ఆ స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్ కోసం జనవరి 30వ తేదీన దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం ఒంగోలు ఆర్డీఓ కార్యాలయంలో పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించాలని మొరపెట్టుకోగా తహసీల్దార్‌ను కలవాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం 11 గంటలకు తహసీల్దార్ ఆదిలక్ష్మిని కలవగా 'మీరు కలెక్టర్ ఆఫీస్ కో, ఆర్డీవోకో ఫిర్యాదు చేసినంత మాత్రాన నేను భయపడతానా, ఆర్టీఏ పెట్టినంత మాత్రాన నేను భయపడతానా, పని అయినప్పుడు తెలియజేస్తాం.. అప్పుడే రావాలి మీరు వెళ్లండి ఇక్కడ నుంచి' అని అనడంతో బోసుబాబు అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు గురించి చెప్పకుండా రోజూ తిప్పుకుంటున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎస్సై వి.అజయ్‌బాబు అర్జీదారుడితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. అర్జీదారుడు నిరసన తెలపడంపై పేర్నమిట్ట-3 వీఆర్‌ఓ కె.జాలయ్య మాట్లాడుతూ.. జనవరి 30వ తేదీ పొజిషన్ సర్టిఫికెట్ కోసం తుళ్లూరి సుభాషిణి దరఖాస్తు చేశారని, ఫిబ్రవరి 5వ తేదీ ఫీల్డ్ వెరిఫికేషన్ చేశామన్నారు. ఆ స్థలంలో గృహ నిర్మాణం చేపట్టగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాని, నిబంధనల ప్రకారం నిర్మాణం జరిగి ఉన్న స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వడం సాధ్యపడదని చెప్పారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

మద్దిపాడు: మండల పరిధిలోని గార్లపాడు గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గార్లపాడు గ్రామానికి చెందిన జానపాటి మనీషా కు నాగులుప్పలపాడు మండలం చీర్వానుప్పలపాడు గ్రామానికి చెందిన జానపాటి ప్రసాద్ తో 12 ఏళ్ల కిందట వివాహమైంది. మనీషా కు తన భర్తతో కొంతకాలం నుంచి వివాదాలు ఏర్పడిన నేపథ్యంలో ఆమె పిల్లలను తీసుకొని గార్లపాడు లో పుట్టింటికి చేరుకుంది. ఈ నేపథ్యంలో మనీషా తన పిల్లలను తల్లి దగ్గర వదిలి పెట్టి ఎటో వెళ్లిపోయిందని భర్త స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ బీ శివరామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏపీఎం జిల్లా కేంద్రానికి సరెండర్

పెద్దదోర్నాల: మహిళా ఉద్యోగిపై వేధింపులకు పాల్పడిన పెద్దదోర్నాల వెలుగు ఏపీఎంను జిల్లా కేంద్రానికి సరెండర్ చేసినట్లు యర్రగొండపాలెం ఏరియా కో ఆర్డినేటర్ డి.దానం తెలిపారు. తనను వేధింపులకు గురి చేస్తున్నాడంటూ సదరు మహిళ సోమవారం పోలీసులను ఆశ్రయించిన విషయం పాఠకులకు విదితమే. ఏపీఎం సరెండర్‌కు సంబంధించిన ఉత్తర్వులు జిల్లా కేంద్రం నుంచి వెలువడినట్లు దానం తెలిపారు. యర్రగొండపాలెం క్లస్టరుకు చెందిన మూల వెంకయ్య ఇన్‌చార్జి ఏపీఎంగా నియమించినట్లు చెప్పారు.

లైంగిక వేధింపుల చట్టాలపై మహిళలకు అవగాహన

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

ఒంగోలు టౌన్: కర్మాగారాల్లో పనిచేసే మహిళలు, విద్యాసంస్థల్లో చదువుకునే బాలికలకు లైంగిక వేధింపుల చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు చెప్పారు. జీజీహెచ్ ఆర్‌బీఏకే కార్యాలయంలో మంగళవారం పిల్లల లైంగిక వేధింపులపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. లైంగిక వేధింపులను ఎదుర్కొనేందుకు మానసికంగా, శారీరకంగా సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య, పాఠశాల విద్య, ఇంటర్మీడియెట్, వికలాంగుల సంక్షేమం, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులకు ఇస్తున్న ఈ శిక్షణలో మహిళా చట్టాలను పరిచయం చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా మానసిక వ్యాధుల నిపుణులు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులకు పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో లైంగిక దోపిడీ ఎక్కువగా జరుగుతోందన్నారు. వనరుల కొరత, ఆహారం, ఆర్థిక భద్రత మహిళలకు శాపంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ భగీరథి, జిల్లా విద్యా శాఖ అధికారి కిరణ్ కుమార్, సైకాలజిస్టులు సుప్రజా దేవి, గిరి రంగ ప్రసాద్, ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ హేమ సుజన్, మాస్ మీడియా జిల్లా అధికారి డి.శ్రీనివాసులు, డాక్టర్ ప్రీతమ్, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

టీచకుడు.. వేధిస్తున్నాడు!

- ఉపాధ్యాయుడి తీరుపై బాలల హక్కుల కమిషన్ సభ్యురాలికి బాలికల ఫిర్యాదు
- విచారణ చేపట్టాలని పోలీసులకు ఆదేశాలు

కొనకనమిట్ల: విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ ఉపాధ్యాయుడు దారి తప్పాడు. గత కొద్ది కాలంగా అతను మతి చలించి ప్రవర్తిస్తున్న తీరు, అసభ్యకర చేష్టలకు పాల్పడుతున్నవైనాన్ని కొందరు బాలికలు బాలల భక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతికి పూసగుచ్చినట్లు వివరించినట్లు సమాచారం. జిల్లా పర్యటనలో భాగంగా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మంగళవారం కొనకనమిట్ల మండలంలోని ఓ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణలో లోపాలను గుర్తించి సక్రమంగా నడుచుకోవాలని, గడువు ముగిసిన వస్తువులను వెనక్కి పంపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా యూపీ పాఠశాలలో ఉపాధ్యాయుడు ప్రవర్తిస్తున్న తీరును బాలికల ద్వారా తెలుసుకుని నిశ్చేష్టురాలయ్యారు. మండల స్థాయి అధికారులను పాఠశాలకు పిలిపించి, బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడిపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. బాలలపై లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలికలపై లైంగిక వేధింపుల విషయం తాను వచ్చే వరకు బయటపడలేదంటే అధికారులు ఏం చేస్తున్నట్లు అని అసంతృప్తి వ్యక్తం చేశారు. కమిషన్ సభ్యురాలి వెంట తహసీల్దార్ సురేష్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రాజ్‌కుమార్, ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ, డీవైఈఓ శామ్యూల్ జాన్, ఎంఈఓ డాంగే షరీఫ్, బి.నర్సింహారావు, సీహెచ్‌ఓ ఎస్‌కే మస్తానమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఎంఎస్‌కే సుధారాణి, బాలల సంరక్షణ అధికారులు ఉన్నారు.

ఇంగ్లిష్ పరీక్షకు 1391 మంది గైర్హాజరు

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. రెండో రోజు ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పేపర్ 1 పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 22,975 మందికి గాను 21,584 మంది విద్యార్థులు హాజరయ్యారు. 1391 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ 20,728 మంది విద్యార్థులకుగాను 19,654 మంది హాజరవగా, 1074 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 2247 మందికి గాను 1930 మంది విద్యార్థులు హాజరవగా, 317 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు నిర్వహించడానికి జిల్లాలో 67 సెంటర్లు కేటాయించారు. ఆర్‌ఐఓలు ఆరుగురు, 12 మంది డీఈసీ, డీఐఈఓ లు, 34 మంది స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

వెట్టి చాకిరీ బందీలకు విముక్తి


బాధితులతో మాట్లాడుతున్న కలెక్టరు తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: పల్నాడు జిల్లాలోని నరసరావుపేట ప్రాంతంలో ఓ కాంట్రాక్టర్ వద్ద ఏళ్ల తరబడి వెట్టి చాకిరీ చేస్తున్న యానాది కుటుంబాలకు జిల్లా అధికారుల చొరవతో విముక్తి లభించింది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన 5 ఎస్టీ(యానాది) కుటుంబాలను నరసరావుపేట ప్రాంతంలో కర్ర కోత కోసం పదేళ్ల క్రితం ఓ కాంట్రాక్టర్ తీసుకెళ్లాడు. అందుకుగాను వారికి కొంత నగదును అడ్వాన్స్ ఇచ్చాడు. ఇక అప్పటి నుంచి వారిని అక్కడే బందించి వెట్టి చాకిరీ చేయిస్తున్నాడు. కర్ర కోతకు వెళ్లిన ఆ కుటుంబాలను కాంట్రాక్టర్ వేధిస్తున్న తీరును బాధితుల బంధువులు భారతీయ జనతా మజ్దూర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖలీఫాతుల్లా బాషాకు వివరించారు. ఈ మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు గత నెలలో ఫిర్యాదు చేయగా ఒంగోలు ఆర్డీఓతో విచారణ చేయించారు. బాధిత కుటుంబాలకు విముక్తి కల్పించగా మంగళవారం కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా ఓ కాంట్రాక్టర్ వద్ద బందీలుగా ఉన్న మరో మూడు కుటుంబాలు తప్పించుకుని వచ్చాయి. వీరందరికీ ఆధార్ కార్డులు మంజూరు చేయడంతోపాటు పౌష్టికాహారం అందించి, పిల్లలకు చదువు చెప్పిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భారతీయ జనతా మాజ్దూర్ సెల్ కార్యదర్శి షేక్ సిద్ధాంబీ, యానాది సంఘ నాయకులు, ఎస్సీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భర్త, అత్తమామలపై వేధింపుల కేసు నమోదు

మద్దిపాడు: మండలంలోని కొలచనకోట గ్రామానికి చెందిన దండేల మౌనిక తన భర్త, అత్తమామలు తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు, అదనంగా డబ్బులు తీసుకొని రమ్మని ఇబ్బంది పెడుతున్నట్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమేరకు స్థానిక ఎస్సై బీ శివరామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ కంఠంలో పచ్చ గద్దలు

- పీసీపల్లి మండలం పెద ఈర్లపాడులో టీడీపీ నేతల భూ కబ్జా
- రూ.3 కోట్ల విలువైన 9.82 ఎకరాల భూమిని చెరబట్టిన పచ్చ ముఠా
- దర్జాగా వెంచర్ వేసి బిట్లు బిట్లుగా విక్రయించేందుకు పక్కా స్కెచ్
- రెవెన్యూ అధికారుల హెచ్చరికలనూ లెక్కచేయని వైనం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి భూమిని కాపాడాలని కోరిన గ్రామస్తులు


ముగ్గు పోసి వెంచర్ వేస్తున్న దృశ్యం

పీసీపల్లి:

అధికారమే అండగా పచ్చ తమ్ముళ్లు బరి తెగిస్తున్నారు. భూ బకాసురుల అవతారమెత్తి ప్రభుత్వ భూములను మింగేస్తున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు యంత్రాలతో చదును చేసి యథేచ్ఛగా ఆక్రమించి వెంచర్లు వేస్తున్నారు. అధికారుల హెచ్చరికలను సైతం లెక్క చేయడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. పీసీపల్లి మండలం పెద ఈర్లపాడులో టీడీపీ నాయకులు విలువైన గ్రామ కంఠం భూమిని కబ్జా చేసి వెంచర్‌గా మార్చిన వైనంపై కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు అందింది. భూ ఆక్రమణను అడ్డుకుని నిందితులపై చర్యలు తీసుకోవాలని కొందరు గ్రామస్తులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయడం చర్చనీయాంశమైంది.

పెద ఈర్లపాడు గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 870లోని 4 సబ్ డివిజన్లలో మొత్తం 11 ఎకరాల గ్రామ కంఠం భూమి ఉంది. ఇందులో 870/2లో 1.18 ఎకరాల భూమిలో చెరువు కాలువ ఉంది. అయితే 870, 870/1, 870/3, 870/4లో ఖాళీగా ఉన్న 9.82 ఎకరాల గ్రామ కంఠం భూమిని టీడీపీ నేతలు ఆక్రమించి వెంచర్ వేశారు. దీని విలువ ఇప్పుడు సుమారు మూడు కోట్ల రూపాయలకు పైగా ఉంటుంది. వాస్తవానికి ఈర్లపాడుకు చెందిన టీడీపీ నాయకులు గతంలోనే ఈ భూమిలో చెట్లు, చిల్లకంప తొలగించి చదును చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ భూమిపై టీడీపీ నాయకులు మళ్లీ కన్నేశారు. అడిగేవారు లేరన్న అధికార మదంతో గ్రామ కంఠాన్ని ఆక్రమించి ఏకంగా వెంచర్ వేశారు. దీనిపై ప్రశ్నించిన స్థానికులపై బెదిరింపులకు దిగడంతో పంచాయితీ కలెక్టర్ వద్దకు చేరింది.

భూ ఆక్రమణపై ఈవోఆర్డీ మల్లేశ్వరిని వివరణ కోరగా.. 'గతంలో గ్రామ కంఠం స్థలం ఆక్రమణకు గురైన విషయం వాస్తవమే. అప్పుడు ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశాం. ఇటీవల కొంత మంది అదే భూమిని మళ్లీ చదును చేసి వెంచర్ వేస్తుండగా సోమవారం హెచ్చరిక బోర్డు పెట్టించాం' అని తెలిపారు.


టీడీపీ నేతలు చదును చేసిన గ్రామకంఠం భూమి


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన పంచాయతీ అధికారులు